క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్



వైరా: ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిస్థితులు, సమస్యల గురించి ఆయనకు వివరించినట్లు తెలిపారు.

గేటుకారేపల్లిలో దెందులూరు ఎమ్మెల్యే

కారేపల్లి: ఏపీలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం కారేపల్లి మండలం గేటుకారేపల్లికి వచ్చారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తోటకూరి దిలీప్‌కుమార్, తోటకూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూరి పిచ్చయ్య ఆహ్వానం మేరకు వచ్చిన ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో పోట్ల వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపును ప్రారంభించిన ఎస్సై



వైరారూరల్: మండలంలోని పాలడుగు గ్రామంలోని ఎస్సీ కాలనీ గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేతి పంపును ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గుండెపోగు జాన్, రాయల కిరణ్, మోదుగు వినోద్ కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

వేంసూరు: వేంసూరు మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని మర్లపాడులో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా నరేష్, కోకన్వీనర్లుగా కంచర్ల కొండలరావు, కంభంపాటి వేణు, జొన్నలగడ్డ సాయికుమార్, వినంపల్లి శరత్ లను ఎన్నుకున్నారు. మహాజన సోషలిస్టు పార్టీ గౌరవ అధ్యక్షుడిగా కోటమర్తి బాలస్వామి, కన్వీనర్‌గా కిన్నెర రత్నకుమార్, కోకన్వీనర్లుగా మరాఠీ రాములు, జొన్నలగడ్డ ముత్తయ్య, మేకల అప్పారావు, వెంకటేశ్వరరావు, ఆరెంపుల సాంబయ్య, ముల్లంగి నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని టాలెంట్ స్కూల్‌లో ట్రెండ్స్ ఆధ్వర్యాన శుక్రవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో కె.మౌనిక, కె.సత్యహర్షిత, జూనియర్స్ విభాగంలో ఆరీఫా, చిన్నంశెట్టి లాస్యశ్రీ, సబ్ జూనియర్స్ విభాగంలో వర్షిత, జ్ఞానిత్య ప్రథమ, ద్వితీయ బహుమతులు, గోల్డ్‌మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు పులి శ్రీనివాసరావు, శంకర్, వీరయ్య, సిబ్బంది అభినందించారు.

రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు



బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం గ్రామంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మతల్లి ఆలయం 6వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లికి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఎస్సై కొండల్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహారావు సంస్మరణ సభ

పెనుబల్లి: విశ్రాంత ఉపాధ్యాయుడు పోలు నరసింహారావు సంస్మరణ సభ శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పలువురు మండల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ.. నరసింహారావు సీపీఎం అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే ఆయన కుమారుడు పోలు కిరణ్ తండ్రి పేరున ట్రస్టు ఏర్పాటు చేసి పేద పిల్లలకు సహాయం చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రామారావు, గిరిజాపతి రావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



నంబర్ ప్లేటు లేకుండా సీఎం రేవంత్ రెడ్డి తాలుకా పేరుతో..



పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా పేరుతో..



ఏపీ సీఎం పేరుతో..



హీరో ప్రభాస్ ఫొటోతో ఉన్న నంబర్ ప్లేట్

ఇవేం నంబర్‌ప్లేట్లు బాబోయ్..

నిబంధనలకు విరుద్ధంగా పలువురి ఏర్పాట్లు

- రాజకీయ నాయకుల తాలుకాల పేర్లతో దర్శనం ఇస్తున్న వైనం
- ప్రమాదాలు జరిగితే.. గుర్తింపు కష్టమే
- కౌన్సెలింగ్‌తో అరికట్టాలని వినతి

వైరారూరల్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత యువకులు, వివిధ పార్టీల కార్యకర్తలు తమ ద్విచక్రవాహనాల నంబర్ ప్లేట్లు నిబంధనలకు విరుద్ధంగా దర్శనం ఇస్తున్నాయి. పలువురు మోటార్ వెహికిల్ యాక్టును ఉల్లంఘిస్తూ తమకు కేటాయించిన బైక్ నంబర్ ప్లేట్లను పూర్తిస్థాయిలో తొలగించి చిత్రవిచిత్రంగా తమ అభిమాన రాజకీయ నాయకుడి తాలూకా.. అంటూ వారి బొమ్మతో నంబర్ ప్లేటును తయారు చేయించి యథేచ్ఛగా పల్లెలు, పట్టణ కేంద్రాల్లో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. నంబర్ లేకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఏ తాలూకా వారిని అడగాలో తెలియని పరిస్థితిలో పోలీసులు మిన్నంటిపోతున్నారు.

తెలంగాణలో ఎన్నికలు ముగిసిన తర్వాత..

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నంబర్ ప్లేట్లపై తాలుకాల ప్రస్తావన మొదలైంది. కొంత మంది యువకులు సీఎం రేవంత్ రెడ్డి తాలుకా నుంచి మొదలుకొని తమ అభిమాన మంత్రి, ఎమ్మెల్యే పేర్లతో నంబర్ ప్లేటు చేయించుకొని వారి తాలుకా అంటూ చక్కర్లు కొడుతున్నారు. ఇంకా ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన ఫలితాలు వెలువడిన తర్వాత నంబర్లు పేట్లు తీసేసి భీభత్సం సృష్టిస్తున్నారు. తమ అభిమాన హీరో పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎం కావడంతో.. మనల్ని ఎవడ్రా ఆపేది అంటూ మోటార్ వెహికిల్ యాక్టును తుంగలో తొక్కుతూ పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అంటూ టూవీలర్ల నంబర్ ప్లేట మీద, కారు వెనుక అద్దం మీద రాయించుకొని రచ్చ చేస్తున్నారు. అలాగే తెలుదేశం అభిమానులు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తాలుకా అంటూ నంబర్లు వేయించుకొని రభస చేస్తున్నారు. కొంత మంది యువకులైతే ఏకంగా తమ అభిమాన హీరోల ఫొటోలతో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

తాలుకాలతో పోలీసులకు సవాల్..

నంబర్లు లేకుండా తాలుకాలతో ఉన్న వాహనాలు ఏదైనా ప్రమాదాలకు గురైతే వారిని గుర్తించడం పోలీసులకు సవాలుగా మారనుంది. పొరపాటున ప్రమాదానికి గురైన వ్యక్తి బండి నంబర్‌పై పలానా తాలుకా అంటే అతనిని ఎలా గుర్తించాలి. పోలీసులు బండి నెంబర్ ఆధారంగానో లేక ఆధార్‌కార్డు ద్వారానో అతని అడ్రస్ తెలుసుకోవచ్చు. సరైన ఆధారాలు లేకపోతే వారి విరాలు గుర్తించడం కష్టమే. అలాగే ఈ మధ్యకాలంలో దొంగలు కూడా తమ బండ్ల నంబర్‌ప్లేట్లపై పలానా తాలూకా అంటూ.. దొంగతనాలకు పాల్పడుతున్నారు. నేరాలను నియంత్రించాలంటే ముందస్తుగా నంబర్‌ప్లేట్లు లేని వాహనాలు గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భారీ జరిమానాలే పరిష్కారం..

ఎవరైనా తమ బండి నంబర్ ప్లేట్లపై పలానా తాలూకా అంటూ.. సరిగా నంబర్ లేకుండా ప్రయాణిస్తే పోలీసులు భారీ జరిమానాలు విధించి కొద్ది రోజులపాటు వారి వాహనాలను సీజ్ చేయాలి. కొందరి యువకులకు అవగాహన లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు నెంబర్లు లేకుండా గల్లి గల్లీనా తిరుగుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ అధికారులు నంబరు లేకుండా తాలుకాల పేర్లతో తిరుగుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కౌన్సెలింగ్ ఇవ్వాలి..



నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి ప్రమాదాలపై వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. నంబర్ ప్లేటు లేకుండా తిరిగితే కలిగే నష్టాలను వివరించాలి. అప్పటికీ నంబర్ ప్లేటు లేకుండా.. తాలుకా పేర్లతో వాహనాలు నడిపితే వారిపై చట్టారిత్యా చర్యలు తీసుకోవాలి.

– కంకణాల అర్జున్‌రావు, సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి, వైరా

జరిమానా విధించాలి..



మోటార్ వెహికిల్ యాక్టును ఉల్లంఘించి నంబర్ ప్లేటులను తొలగించి.. తమ అభిమాన నాయకుడి తాలుకా పేర్లతో తిరుగుతున్న వారిని పట్టుకొని భారీ జరిమానాలు విధించి, వాహనాలను కొన్ని రోజులు సీజ్ చేయాలి. అప్పుడే వారికి పోలీస్ వ్యవస్థ పట్ల భయం పెరుగుతుంది.

– బొంతు రాంబాబు, సీసీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వైరా

ఉపేక్షించేది లేదు..



నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదు. నంబర్ ప్లేటు లేని వాహనాలపై చట్టారిత్యా కేసులు నమోదు చేస్తాం. అలాగే మైనర్లు టూవీలర్ నడిపితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి.

– సునావత్ సాగర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, వైరా

భూమి ఆరోగ్యానికి పచ్చిరొట్ట ఎరువులు



కొణిజర్ల: పెద్దగోపతిలో జనుము పంటను పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: భూమి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగు చేయాలని ఏఓ బాలాజీ సూచించారు. శుక్రవారం మండలంలోని గోపవరం, పెద్దగోపతి గ్రామాల్లో రైతులు సాగు చేసిన జీలుగలు, జనము పంటలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 60శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందజేస్తున్నదన్నారు. అయితే పచ్చిరొట్ట విత్తనాలు 40 నుంచి 45 రోజుల లోపే దున్నేయాలన్నారు. లేని పక్షంలో దంటుగా మారి భూమిలోని నత్రజని మొత్తం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈఓ శ్రీనివాసరాజు ఉన్నారు.

కొత్త వెంకటగిరిలో..



తల్లాడ: కొత్త వెంకటగిరిలో పచ్చిరొట్ట పైరును పరిశీలిస్తున్న ఏఈఓ, రైతులు

తల్లాడ: మండలంలోని కొత్త వెంటగిరిలో శుక్రవారం జీలుగుల పచ్చిరొట్టను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట పూర్తిగా కలియదున్ని పది రోజులు మురగబెట్టిన తర్వాతే వరి నాటుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాకాలపాటి వీరభద్రరావు, దిరిశాల సత్యనారాయణ, రామక్రిష్ణచారి, వీరభద్రరావు, నరసింహారావు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి



యడవల్లి చెరువు కట్ట సమీపంలో భూములను పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ అధికారులు

ముదిగొండ: మండలపరిధిలోని యడవల్లిలోని పోలినేని చెరువు, సాగర్‌కాలువపై ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి ఇటీవల తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలినేని చెరువు, సాగర్‌కాలువను నీటిపారుదల శాఖ ఈఈ రామకృష్ణ, డీఈ పెద్దరాంబాబులు పరిశీలించారు. గ్రామస్తులు ఆక్రమణలను అడ్డుకోవాలని, ఎన్నెస్పీ నీళ్ల చెరువుల్లోకి వచ్చేలా చూడాలని, చెరువు కట్టపై సర్వే చేసి ఈతచెట్లు నాటాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గ కాంగ్రెస్ బీబ్లాక్ అధ్యక్షుడు వీరబాబు, కాంగ్రెస్ నాయకులు శివ, రైతు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

సత్తుపల్లి: సత్తుపల్లి ప్రాంతంలోని నిరుద్యోగ యువకులు పదిలో ఉత్తీర్ణులై హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు మూడేళ్ల అనుభవం కలిగిన వారు ఉచిత వాల్వోడంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు కోరారు. సింగరేణి ఏరియా ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వైద్య పరీక్షలు చేసి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా స్థానిక ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.



సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు

మొక్కలు నాటి సంరక్షించండి



తామరచెరువు కట్టపై మొక్క నాటుతున్న మట్టా దయానంద్, నాయకులు

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తామరచెరువు కట్టపై వనమహోత్సవం నిర్వహించి.. పలు రకాల మొక్కలు నాటారు. తామరచెరువులో బోటింగ్ సదుపాయం కల్పించినట్లైతే ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. తామరచెరువు బతుకమ్మ ఘాట్ మెట్లపై మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, తోట సుజలరాణి, మారుతి బాబురావు, నాగళ్ల ప్రసాద్, మెప్మా ప్రసాద్, నరేష్, కంటే నాగలక్ష్మి, దోమా ఆనంద్, ఎఫ్‌బీఓ పద్మ, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం తహసీల్దార్ ఎం.ఉషాశారద.. ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేసిన కల్యాణలక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెట్రోల్ తీశాడని వ్యక్తిపై దాడి

తల్లాడ: బైక్ నుంచి పెట్రోల్ తీశాడనే కోపంతో గురువారం రాత్రి ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఇది. మండలంలోని అన్నారుగూడెంకు చెందిన గొడ్ల కాటయ్య తన బైక్ నుంచి పెట్రోల్ తీశాడంటూ కొత్తపల్లి బాబురావు గురువారం రాత్రి రాయితో కొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన కాటయ్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్సై కొండల్‌రావు తెలిపారు.

దాడి విషయంలో కేసు నమోదు

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన నరేష్‌పై గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన మందా వెంకటేశ్వర్లు దాడి చేయడంతో కేసు నమోదైంది. పాత కక్షల నేపథ్యంలో శుక్రవారం నరేష్‌ను వెంకటేశ్వర్లు రాయితో కొట్టడంతో తల పగిలి తీవ్ర గాయమైంది. బాధితుని ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఇరువర్గాల ఘర్షణ

కారేపల్లి: భార్యభర్తలు గొడవ పెట్టుకొని పోలీస్ స్టేషన్ రాగా, స్టేషన్ ముందు ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఘర్షణకు దిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఈట్యాతండా గ్రామానికి చెందిన భార్యభర్తల మధ్య విభేదాలు రావటంతో.. ఆ వివాదం శుక్రవారం పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. ఇదే క్రమంలో భర్త తరుపు, భార్య తరుపు బంధువులు సైతం కారేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకోవటంతో..ఒక్కసారిగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను వారించి అక్కడి నుంచి పంపించివేశారు.

వినతుల వెల్లువ..

ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని తహసీల్దార్‌కు..

ఎర్రుపాలెం: నిరుద్యోగులకు ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావుతో పాటు పలువురు నాయకులు మండల తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయి చూపిందని, అదే రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కనిపిస్తుందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 25వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నాయకులు కోటేశ్వరరావు, రామకృష్ణ, గోపాలరావు, రాము గౌడ్, కృష్ణారెడ్డి, రవి, శ్రీకాంత్, సురేష్, మోహన్‌రావు, బుచ్చిబాబు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని..

ఎర్రుపాలెం: బదిలీ ఉపాధ్యాయులను ప్రభుత్వం తక్షణమే రిలీవ్ చేయాలని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు బండారు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు విద్యావనరుల కేంద్రం కంప్యూటర్ ఆపరేటర్ త్రివేణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, కోటేశ్వరరావు, పాండురాజు, వెంకటకృష్ణ, శ్రీధర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆక్రమించిన దారిని పునరుద్దరించాలని..



తహసీల్దార్, ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోనకల్: మండలంలోని మోటమర్రి గ్రామ పంచాయతీ దారిని కొంతమంది ఆక్రమించారని దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రాజు, ఎంపీఓ శాస్త్రికి గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా మేము పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇటీవల మా గ్రామానికి వచ్చిన భట్టికి సమస్యను వివరించగా.. అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు వారు స్పందించలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతి అందించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు, మరీదు నాగేశ్వరరావు, మరీదు మల్లయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న వీరభద్రంనాయక్

కారేపల్లి: తప్పుడు పత్రాలతో పట్టా చేయించుకొని, రైతు ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలని శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల భద్రయ్యకు చెందిన 1.20ఎకరాల భూమిని, మాజీ ఆర్టీఏ కమిషనర్ శంకర్‌నాయక్, భార్య లక్ష్మీలు ఆక్రమించుకొని, పట్టా చేయించుకున్నారని, ఏదేమిటని ప్రశ్నించిన భద్రయ్య కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసి తప్పుడు కేసులు బనాయించారన్నారు. ఇప్పటికైనా భూవివాదాన్ని పరిష్కరించి బాధిత రైతు భద్రయ్య కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బన్సిలాల్, మండల కమిటీ సభ్యులు వజ్జా రామారావు, దాసరి మల్లయ్య, తలారి దేవప్రకాశ్, వడ్డె అజయ్‌బాబు, సూరపాక ధనమ్మ, లక్ష్మణ్, రవి, కొండలరావు, చందర్, మంగమ్మ, సైదులు, శోభన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రయ్యకు యాదవ సంఘం నాయకుల పరామర్శ..

ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు భద్రయ్యను యాదవ సంఘం జిల్లా నాయకుడు చిలకల వెంకటనర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు. భద్రయ్యను పరామర్శించిన వారిలో ఇమ్మడి తిరుపతిరావు యాదవ్, సొసైటీ డైరెక్టర్ ఉపేందర్, నాగేశ్వరరావు, మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బన్సిలాల్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీజనల్ వ్యాధులపై సన్నాహక సమావేశం..



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్



మధిర: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత



ఏన్కూరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్/తల్లాడ: వ్యాధులు ప్రబల్లకుండా సత్తుపల్లి పట్టణంలోని 23 వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. అదే విధంగా సత్తుపల్లి, తల్లాడ మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు మాట్లాడారు. జ్వరాలను అరికట్టేందుకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారని, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తించాలని, మురుగునీరు,కరెంట్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో కమిషనర్ మందా రవిబాబు, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు సూరిబాబు, ప్రవీణ్, భవాని, మహ్మద్ అనీస్, ఎస్‌కె ఛాంద్‌పాషా, కంటే నాగలక్ష్మి, నాగుల్‌మీరా, మందపాటి పద్మజ్యోతి, అద్దంకి అనీల్, రఘు, పుష్పలత, విజయనిర్మల, చింతల రమాదేవి, గంగారం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్, ఐబీ డీఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీధర్, ఈఓఆర్డీ పి.కృష్ణ, ఆర్ అండ్‌బీ జేఈ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఐకేపీ సీసీలు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కె.శ్రీదేవి, ప్రత్యేకాదికారులు తాజుద్దీన్, రాజేష్, ఏపీఓ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మధిర/మధిరరూరల్/ముదిగొండ/చింతకాని: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత తెలిపారు. శుక్రవారం మధిర మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, పారిశుద్ధ్య, మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదే విధంగా మధిర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ముదిగొండ, చింతకాని మండలాల్లోని రైతువేదికలో అధికారులతో నిర్వహించిన సమావేశాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణాదేవి, ఎంపీడీఓ రామయ్య అవగాహన కల్పించారు. వార్డు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యవేక్షిస్తూ ఉండాలని, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ కమిషనర్ వేణు, మేనేజర్ రవీంద్ర కుమార్, ఎంపీపీలు లలిత, హరిప్రసాద్, జెడ్పీటీసీ దుర్గ, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ శాస్త్రి, సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విజయరాజు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు, ఏఓ రాధ, చింతకానిలో.. తహసీల్దార్ రమేష్, మండల వైద్యాధికారి అల్తాఫ్, మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు: ఏన్కూరులోని రైతువేదిలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ సకినాల రమేష్ మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, వైద్యాధికారులు రాములు, మౌనిక, ఎంపీటీసీ కృష్ణవేణి, ఎంపీఓ జీవీఎస్ నారాయణ, సీహెచ్ జయరాజు, ఏపీయం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ: మాట్లాడుతున్న వైద్యాధికారిణి అరుణదేవి



తల్లాడ: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

సమయపాలన పాటించాలి

వేంసూరు: ప్రస్తుత సీజనల్ వ్యాధుల కాలం తరుణంలో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీపీ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సలహాలమండలి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా రేకుల షెడ్ మంజూరు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఇందు ప్రియంక, సీహెచ్ఓ వెంకటనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.